క్లుప్తంగా

సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

మిర్యాలగూడ టౌన్ : సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని బీసీ యువజన సంఘం జిల్లా కార్యదర్శి ఊరిబండి శ్రీనివాస్ యాదవ్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 19 రోజులుగా ఉద్యోగులు ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. ఉద్యోగులకు తాము అండగా ఉంటామని, వారి హక్కుల సాధన కోసం ఉద్యమిస్తామని తెలిపారు. ఉద్యోగులపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలను మానుకోవాలని తెలిపారు.

వైభవంగా ధనుర్మాస ఉత్సవాలు

మిర్యాలగూడ టౌన్ : ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం పట్టణంలోని రెడ్డికాలనీలో శ్రీకోదండ రామాలయం, హౌసింగ్‌బోర్డులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈకార్యక్రమంలో వేద పండితులు శ్రీచెరుకుపల్లి కిరణ్‌కుమారాచార్యులు, రాఘవాచార్యులు, ఆలయ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

పెద్దవూర : మండల కేంద్రానికి చెందిన కర్నాటి అనసూయమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. శనివారం నిర్వహించిన దశదిన కర్మకు హాజరైన ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి, తిరుమలగిరి సాగర్ మాజీ వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి, పెద్దవూర మాజీ సర్పంచ్ నడ్డి లింగయ్య, మాజీ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పులిమాల కృష్ణారావు, బోయ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇంటి స్థలం ఇవ్వాలని వినతి

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణ విద్యార్థి ఉద్యమకారులకు 250గజాల ఇంటి స్థలాన్ని కేటాయించాలని కోరుతూ శనివారం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి లింగంగౌడ్ వినతిపత్రం అందజేశారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో విద్యార్థులు తమ ప్రాణాలను, జీవితాలను, సమయాన్ని పణంగా పెట్టి ఉద్యమించారన్నారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో మంత్రిని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో కోనేటి రమేష్, కిరణ్, రమేష్, సోమేశ్వర్ తదితరులున్నారు.

ఒకే గ్రామంలో ఇద్దరికి గ్రూప్ -4 ఉద్యోగం


కత్తి శివశంకర్‌రెడ్డి


లక్క లింగారెడ్డి

పెద్దవూర : మండలంలోని బట్టుగూడెం గ్రామానికి చెందిన ఇద్దరు ఒకేసారి గ్రూప్ -4 ఉద్యోగాలకు ఎంపికై రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్లుగా శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆ గ్రామానికి చెందిన కత్తి శివశంకర్‌రెడ్డి మిర్యాలగూడెం తహసీల్దార్ కార్యాలయంలో, రిటైర్డ్ ఆర్మీ లక్క లింగారెడ్డి గుడిపల్లి తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్లుగా బాధ్యతలు చేపట్టారు. ఒకే గ్రామం నుంచి ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంపై గ్రామస్తులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

యాద్గార్‌పల్లిలో పశువైద్య శిబిరం


పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఉపేందర్‌రెడ్డి

మిర్యాలగూడ : పాడి రైతులు పశువైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాయం ఉపేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని యాద్గార్‌పల్లిలో ఏర్పాటు చేసిన పశు వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పశువులకు ఎలాంటి వ్యాధులు వచ్చినా పశు వైద్యశాలకు వచ్చినట్లయితే చికిత్స నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అప్పన బోయిన వెంకటయ్య, వెంకన్న, సతీష్, పశువైద్యశాల డాక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువు తయారీ ఏదీ!

- అలంకారప్రాయంగా సెగ్రిగేషన్ షెడ్లు
- ఒక్కో షెడ్డుకు సుమారు రూ.2.50 లక్షలు
- నిర్వహణ మరిచిన అధికారులు
- కానరాని తడి, పొడి చెత్త సేకరణ


పెద్దవూరలో నిరుపయోగంగా ఉన్న సెగ్రిగేషన్ షెడ్డు


ఖాళీగా ఉన్న ఎరువు తయారీ అరలు

పెద్దవూర : గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపర్చడంతో పాటు, పర్యావరణ పరిరక్షణకు ముప్పు వాటిల్లకూడదని, పంచాయతీలకు అదనపు నిధులు సమకూర్చాలనే ఉద్దేశ్యంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పల్లె ప్రగతిలో భాగంగా సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. గ్రామాల్లో సేకరించిన చెత్త నుంచి తడి, పొడి చెత్తలుగా వేరు చేసి సేంద్రీయ ఎరువులు తయారు చేయడంతో పాటు మిగతా వ్యర్థాలను డంపింగ్ యార్డులో పోయాలి. కానీ రూ. లక్షలు వెచ్చించి గ్రామాల్లో ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ పంచాయతీల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఇది ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

లక్షల నిధులు వృథా

మండలంలో 26 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఒక్కో నిర్మాణానికి సుమారు రూ.2.50 లక్షలతో ప్రతి గ్రామ పంచాయతీలో సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణం చేపట్టారు. కాగా ప్రస్తుతం ఆయా గ్రామాల్లో సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. సెగ్రిగేషన్ షెడ్‌లో తడి, పొడి, ప్లాస్టిక్, గాజు, అట్ట, పేపర్ తదితర చెత్తను వేర్వేరుగా నిలవ చేయడానికి ప్రత్యేక అరలు ఏర్పాటు చేశారు. దీంతో పాటు చెత్తను తరలించడానికి ప్రతి పంచాయతీకి ట్రాక్టర్లను, నీళ్ల ట్యాంకర్లను కొనుగోలు చేసి అప్పగించింది. తడి, పొడి చెత్త వేరు చేసేందుకు ఇంటింటికీ రెండు రకాల చెత్త బుట్టలు సైతం పంపిణీ చేశారు. తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించక పోవడంతో గ్రామాల్లో ఎరువులు తయారు చేసిన దాఖలాలు లేవు. చాలా పంచాయతీల్లో ఒకే స్థలంలో శ్మశాన వాటిక, కంపోస్టు షెడ్లు నిర్మించారు. సేంద్రియ ఎరువు తయారు చేసేలా నిర్మించిన కంపోస్టు షెడ్లు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ప్రారంభ దశలో వాటి నిర్వహణపై ఆసక్తి కనపర్చిన అధికార యంత్రాంగం కాలక్రమేణ వాటిని పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. సెగ్రిగేషన్ షెడ్లు గ్రామాలకు దూరంగా ఉండటం, ఆయా చోట్ల తగినంత సిబ్బంది లేకపోవడం, అధికారుల పర్యవేక్షణ కొరవడడం వంటి అనేక కారణాలు లక్ష్యానికి అవరోధంగా మారుతున్నాయి.

తయారు కాని ఎరువు

పారిశుద్ధ్య సిబ్బంది చెత్త సేకరించే సమయంలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలి. అక్కడ సెగ్రిగేషన్ షెడ్డులో ప్రత్యేకంగా తయారు చేసిన అరలలో తడి, పొడి చెత్తను వేయాలి. తడి చెత్తను దాదాపు 45 రోజుల పాటు దశలవారీగా సేంద్రీయ ఎరువు తయారు చేయాల్సి ఉంటుంది. అయితే క్షేత్ర స్థాయిలో అవేమీ జరగడం లేదు. చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తున్న సిబ్బంది గ్రేడింగ్ చేయకుండా కుప్పలుగా పారబోస్తున్నారు. చెత్తను అడ్డగోలుగా పోస్తుండటంతో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు గాలికి పంట పొలాల్లో చేరి రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

డంపింగ్ యార్డులకు తరలని చెత్త

మండలంలోని పలు గ్రామాలలో చెత్త డంపింగ్ యార్డులకు తరలడం లేదు. గ్రామాల్లో వీధుల వెంట చెత్తాచెదారం దర్శనమిస్తుంది. వాటినుంచి దుర్వాసన వస్తుండటంతో ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల మేరకు పంచాయతీ సిబ్బంది ఆ చెత్తను వారం, పది రోజులకు ఒకసారి తీసుకెళ్లి గ్రామ శివారులో పడేసి మంట పెడుతున్నారు. దీంతో దారిన వెళ్లే వారికి సమస్యగా మారింది. ప్రస్తుతం గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుంది. ఇకనైనా అధికారులు స్పందించి సెగ్రిగేషన్ షెడ్లు, డంపింగ్ యార్డుల నిర్వహణను పూర్తిస్థాయిలో చేపట్టి ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించడంతో పాటు గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూర్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకువస్తాం



సెగ్రిగేషన్ షెడ్లు, డంపింగ్ యార్డుల నిర్వహణను పూర్తిస్థాయిలో చేపట్టి వినియోగంలోకి తీసుకువచ్చేలా చూస్తాం. పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి పారిశుద్ధ్య సిబ్బంది సేకరించిన చెత్తను గ్రేడింగ్ చేసి కంపోస్ట్ ఎరువులను తయారు చేయిస్తాం. ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించి, జీపీలకు ఆదాయం సమకూర్చేలా మారుస్తాం.

– సుధీర్‌కుమార్, ఇన్‌చార్జ్ ఎంపీఓ, పెద్దవూర

దుకాణ సముదాయం కూల్చివేత


దుకాణ రేకుల షెడ్డును కూల్చివేస్తున్న అధికారులు

మిర్యాలగూడ : పట్టణంలోని సాగర్ రోడ్డులోని చెప్పుల దుకాణ సముదాయాన్ని మున్సిపల్ అధికారులు శనివారం ఉదయం కూల్చివేశారు. సర్వే నంబర్ 992లోని సుమారు 10గుంటల భూమి గ్రామ కంఠంగా ఉంది. ఈ భూమి 65ఏళ్ల క్రితం గ్రామ కంఠంగా నమోదైనట్లు రెవెన్యూ రికార్డులు ఉన్నాయి. ఆ భూమిని కొందరు కొనుగోలు చేయగా వాటిని కిరాయి నిమిత్తం చెప్పుల షాపు యజమానికి ఇచ్చారు. రెండేళ్లుగా ఆ షాపు నడుతుపుతున్నాడు. ఇటీవల మున్సిపల్ అధికారులు బిల్డింగ్ పర్మిషన్, ట్రేడింగ్ లైసెన్స్ లేనందున దీన్ని తొలగిస్తామని నోటీసులు జారీ చేశారు. భూమికి సంబంధించిన వ్యక్తులు కోర్టును ఆశ్రయించడంతో నాలుగు వారాల గడువు ఇచ్చింది. గడువు పూర్తయిన వెంటనే మరోసారి ఈనెల 18న అధికారులు నోటీసులు జారీ చేశారు. రెండు రోజుల గడువు కావాలని షాపు యజమాని శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌ను కోరగా దాన్ని నిరాకరించి శనివారం ఉదయం 6గంటల సమయంలో పోలీసు బందోబస్తు నడుమ అధికారులు ఆ దుకాణాన్ని కూల్చివేశారు. ఈ సందర్భంగా షాపు యజమాని అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ మౌఖికంగా రెండు రోజుల గడువు ఇస్తానని చెప్పిన కమిషనర్ తెల్లారే సరికి జేసీబీ సాయంతో పూర్తిగా షెడ్డును నేలమట్టం చేశారని తెలిపారు. దీంతో పైపులు, రేకులు పనికిరాకుండాపోయి. దీంతో రూ.10లక్షల మేరకు తమకు ఆస్తి నష్టం జరిగిందని పేర్కొన్నారు.

అనుమతులు లేని నిర్మాణాలపై చర్యలు

మున్సిపాలిటీలోని సాగర్ రోడ్డులో అనుమతులు లేని నిర్మాణాల పై చర్యలు తీసుకుంటున్నట్లు సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాగర్‌రోడ్డులో మున్సిపాలిటీ అనుమతులు లేకుండా, ట్రేడ్ లైసెన్స్ లేకుండా దుకాణాన్ని ఏర్పాటు చేశారని, ఈవిషయంపై రెండు నెలల క్రితం మున్సిపాలిటీ నుంచి నోటీసు అందజేసినట్లు తెలిపారు. అదే విధంగా ఈనెల 18న మరోసారి నోటీసులు జారీచేసినట్లు తెలిపారు. మున్సిపల్ చట్టం నిబంధనలకు విరుద్ధంగా దుకాణ సముదాయాన్ని ఏర్పాటు చేయడంతో ఆ అక్రమ నిర్మాణాన్ని తొలగించినట్లు తెలిపారు. నిర్మాణాలు చేపట్టే ముందు ఇంటి యజమాని ముందుగా మున్సిపాలిటీ అనుమతులు తీసుకోవాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమీషనర్ యూసుఫ్, తహసీల్దార్ హరిబాబు పాల్గొన్నారు.

అందుబాటులోకి 108 అంబులెన్స్ సేవలు



త్రిపురారం : మండలంలో 108 అంబులెన్స్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని త్రిపురారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పెద్దదేవుల పల్లి ప్రాథమిక ఆరోగ్య కేద్రం పరిధిలో నూతన 108 వాహనం సేవలు సద్వినియోగం చేసుకోవాలని వైద్య సిబ్బంది సూచిస్తున్నారు. మండలంలో అత్యధికంగా తండాలు ఉండడంతో 108 వాహనం అందుబాటులోకి రావడం మండల ప్రజలకు వెసులుబాటుగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రైతులందరికీ పట్టాలందేలా చూడాలి

- సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి, మాజీమంత్రి జానారెడ్డి


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి, మాజీమంత్రి జానారెడ్డి

నాగార్జునసాగర్ : తిరుమలగిరి(సాగర్) మండలంలోని రైతులకు భూ పట్టాలు అందేలా చర్యలు తీసుకోవాలని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి, మాజీమంత్రి జానారెడ్డిలు అధికారులను ఆదేశించారు. సాగర్ విజయవిహార్‌లోని సమావేశమందిరంలో జిల్లా రెవెన్యూ, అటవీశాఖ అధికారులతో వారు శనివారం సమీక్ష నిర్వహించారు. ధరణి పోర్టల్ పైలెట్ ప్రాజెక్టు కింద ఆరునెలలుగా రెవెన్యూ, అటవీశాఖ అధికారులు సాగుభూముల లో సర్వే నిర్వహిస్తున్నారు. ఢీఫారెస్ట్, ఫారెస్ట్, కాందీశీకుల, బంజరు, అసైన్‌మెంట్ భూములలో సాగు చేసుకుంటున్న రైతులకు సర్వే చేసి పట్టాలు అందజేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్షలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్, కర్నాటి లింగారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్ సేవలు చిరస్మరణీయం


మిర్యాలగూడ : కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, నాయకులు


దేవరకొండ : మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మిర్యాలగూడ : దేశ ఆర్థిక వ్యవస్థలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మన్మోహన్‌సింగ్ మృతి కి సంతాపంగా శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయం నుంచి ఎన్‌ఎస్‌పీ క్యాంపు వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఆర్థికవేత్తగా, ప్రధానిగా మన్మోహన్‌సింగ్ దేశానికి సేవలు చేశారన్నారు. ఆయన తీసుకొచ్చిన పథకాలతో అనేక మంది పేదలు లబ్ధి పొందారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నూకల వేణుగోపాల్‌రెడ్డి, గాయం ఉపేందర్‌రెడ్డి, ధీరావత్ స్కైలాబ్‌నాయక్, ముదిరెడ్డి నర్సిరెడ్డి, శ్రీను, నివాస్, వైద్యులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు నివాళి

దేవరకొండ : భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు శనివారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. దేవరకొండ పట్టణంలోని గ్రంథాలయం వద్ద ఆయన చిత్రపటానికి ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు మన్మోహన్‌సింగ్ ఎన్నో సంస్కరణలు చేపట్టి దేశపురోగతికి కృషి చేశాడన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కరాచారి, అంకం చంద్రమౌళీ, కృష్ణాచారి, భాష, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని పేదలకు శనివారం న్యూ కంబాల శివలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ సర్వీసెస్ ఆర్గనైజర్, హ్యూమన్ రైట్స్ డిఫెండర్ హమీద్ షేక్, దాసోజు భిక్షమాచారి, మహేష్, లక్ష్మిబాయి, బాల మాధవి, నాగమణి, జానీ, రాజేందర్ తదితరులున్నారు...

సమగ్ర శిక్షా ఉద్యోగుల మౌనదీక్ష


కలెక్టరేట్ ఎదుట టోపీలు పెట్టుకుని నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

నల్లగొండ టౌన్ : తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కొన్ని రోజులుగా కలెక్టరేట్ ఎదుట సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు శనివారం సమ్మెలో భాగంగా గాంధీ టోపీలు ధరించి మౌన దీక్షతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎం.కృష్ణ, రాజు, మహేందర్, క్రాంతికుమార్, చంద్రశేఖర్, గుమ్మల మంజులరెడ్డి, నీలాంబరి, సావిత్రి, పుష్పలత, వెంకట్, వెంకటేశ్వర్లు, నాగయ్య, నాగరాజు, రవి, లలిత, శ్రీనివాస్, వసంత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె


దేవరకొండ : దామరచర్లలో నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు


దేవరకొండ : ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

మిర్యాలగూడ : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామపంచాయతీ కార్మికులు దామరచర్ల ఎంపీడీఓ కార్యాలయం వద్ద చేపట్టిన టోకెన్ సమ్మె శుక్రవారం రెండో రోజు చేరుకుంది. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బైరం దయానంద్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అందించాలన్నారు. జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలన్నారు. జీఓనంబర్ 51ని సవరించాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, మృతిచెందిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాడపల్లి శ్రీరాములు, ఎండి.జైరుద్దీన్, సైదులు, నాగమల్లయ్య, జోలమ్మ, సోమమ్మ, సుందరమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ : పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం దేవరకొండ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంచాయతీ కార్మికుల మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించాలన్నారు. ఎన్నికలకు ముందు ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరారు. ప్రతి కార్మికుడికి ప్రమాద బీమా, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో కార్మికుల సమస్యలపై చర్చించి నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, మల్లయ్య, లక్ష్మి, పుష్పలత, పార్వతమ్మ, రాజు ఉన్నారు.

త్రిపురారం : గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు పోలె సాంబయ్య డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట టోకెన్ సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు ప్రభుత్వం జీతాలు సకాలంలో చెల్లించకపోవడంతో పూట గడవక నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో కార్మికులు నిత్యం పనిచేయక పోతే వీధులు కంపు కొడుతాయన్నారు. ప్రతి నెల జీతాలు వచ్చే విధంగా శాశ్వత పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గుర్రంపోడు : పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మండల సీపీఎం కార్యదర్శి వనమాల కామేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలకేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికుల దీక్షా శిబిరం వద్ద సంఘీభావం ప్రకటించి మా ట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్మికుల సంఘం నాయకులు పగిడిమర్రి సర్వయ్య, కార్మికులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం


క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న సభ్యులు

గుర్రంపోడు : ప్రభుత్వ పాఠశాలలకు దాతల సహకారం అభినందనీయమని పిట్టలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం యాదయ్య అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ ఎలైట్ ఆధ్వర్యంలో శనివారం పిట్టలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ విద్యార్థి వికాసానికి క్రీడలు ఎంతో ప్రాముఖ్యత ఉంటుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడా సామగ్రి దాత మదన్‌మోహన్ లయన్స్ క్లబ్ చీఫ్ గెస్ట్ గోవింద్‌రెడ్డి, కిరణ్‌కుమార్, కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, ఆర్‌సీ బోనగిరి సుందర్, వెంకట్ రెడ్డి, మల్లయ్య, పాఠశాల టీచర్లు యాదగిరి రెడ్డి, సైదయ్య, అద్దంకి సునీల్‌కుమార్, అశోక్ రెడ్డి, పీఈటీ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

గుండెపోటుతో రైతు మృతి


కొండ నర్సింహ్మ

గుర్రంపోడు : భూ వివాదంతో ఒత్తిడికి గురై ఓ రైతు గుండె పోటుతో మృతి చెందిన సంఘటన మండలంలోని ఆమలూరు గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ పసుపులేటి మధు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కొండ నర్సింహ(44), రాచమల్ల శ్రీశైలం, రాచమల్ల అంతయ్యలకు మధ్య భూమి పంచాయతీ ఉంది. శనివారం ఉదయం వ్యవసాయ భూముల వద్ద పంచాయతీ జరిగింది. దీంతో ఒత్తిడికి గురైన నర్సింహ క్రింద పడిపోయాడు, గమనించిన కుటుంబ సభ్యులు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. భార్య కొండ పెద్దమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

దేవాలయాల పరిరక్షణ అందరి బాధ్యత


పేరూర్ శివాలయంలో పూజలు చేస్తున్న మురళిశర్మ, ధర్మ రక్ష ఫౌండేషన్ సభ్యులు

హాలియా : దేవాలయాలను రక్షించుకోవడం ప్రతి ఒక్క హిందువు బాధ్యతని హనుమాన్ శక్తి జాగరణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మురళి శర్మ అన్నారు. ధర్మరక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం అనుముల మండలంలోని కొట్టాలలో నిర్వహించిన దూపదీప నైవేద్య కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ధర్మ రక్షా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఆరు మండల్లో ఒక గ్రామాన్ని ఎంచుకొని ధూపదీప నైవేద్యానికి నోచుకోని దేవాలయాలకు నిత్య పూజా సామగ్రి అందజేస్తున్నట్లు తెలిపారు. ధర్మ రక్ష ఫౌండేషన్ అధ్యక్షుడు అనుముల నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించి ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ గౌరవ సలహాదారు సైదులు, ఉపాధ్యక్షుడు మేదరి సైదులు, చింతకాయల అంజి, ట్రెజరర్ కడమంచి నగేష్, గ్రామ పెద్దలు బొమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, బొమ్మిశెట్టి రాంబాబు, వెంకటేశ్వర్లు, మల్లిఖార్జున్, తోట నారాయణ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆటోల్లో పరిమితికి మించి ఎక్కించొద్దు

అడవిదేవులపల్లి : ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించొద్దని, ఎక్కిస్తే ఆ ఆటో డ్రైవర్‌పై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శేఖర్ హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొన్ని రోజులుగా వ్యవసాయ పనులకు కూలీల ఆటో పరిమితికి మించి ఎక్కిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా డిసెంబరు 31 రాత్రి డీజేలకు ఎలాంటి అనుమతులు లేవని, డీజేలు పెడితే కేసులను నమోదు చేయనున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం


కొండమల్లేపల్లి : ఆర్థికసాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కొండమల్లేపల్లి : పట్టణానికి చెందిన జొరిగల పుష్పలత కొన్నేళ్లుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ రెండు రోజుల క్రితం మృతిచెందింది. కేఎంపీ హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ సభ్యులు శనివారం ఆ కుటుంబాన్ని పరామర్శిం రూ.15వేలను ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటి సభ్యులు, ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ ఏరుకొండ రాము, కూన భానుచందర్, విప్పలపల్లి జితేందర్ యాదవ్, అలుగుబెల్లి నాగార్జునరెడ్డి, సాల్‌రెడ్డి, అంజయ్య, వెంకటేశ్వర్లు, యాదగిరి, దండు రవికుమార్, రమేష్, ప్రవీన్, పరమేష్ పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : స్థానిక గాంధీనగర్‌లో దాసరి స్వప్నకు చెందిన గుడిసె ఇటీవల షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. శనివారం ఈ విషయం తెలుసుకున్న ఫెయిత్ బంజారా ఆనాథ ఆశ్రమ నిర్వాహకులు ధీరావత్ హన్యానాయక్ బాధిత కుటుంబానికి, బియ్యం, నిత్యావసర సరుకులు, నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ధీరావత్ రమాబాయి, శ్రవణ్, దైద శ్రీనివాస్, సైదులు, నాగేశ్వర్‌రావు, సౌజన్య, లలిత, మంగమ్మ, కీర్తన, అమృత, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

మండలి చైర్మన్‌ను కలిసిన బంజారా నాయకులు


సుఖేందర్‌రెడ్డితో బంజారా సంఘం నాయకులు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి బంజారా సేవా సంఘం నాయకులు శనివారం శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా గతంలో బంజారా భవనానికి నిధులు మంజూరు చేయిస్తానని ఇచ్చిన హామీని గుత్తాకు గుర్తు చేసినట్లు తెలిపారు. త్వరలోనే ఆ నిధులు మంజూరు చేయిస్తానని మండలి చైర్మన్ తెలిపినట్లు సంఘం సభ్యులు పేర్కొన్నారు. ఆయనను కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు లాలునాయక్, సురేష్‌నాయక్, రాణిరాజునాయక్, జగన్‌నాయక్, మధునాయక్, అనితరాములునాయక్ ఉన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న పల్లా నర్సింహారెడ్డి

డిండి : భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ఆవిర్భావ వేడుకల సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆ పార్టీ మండల కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో శ్రేణులు పోటీకి సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటరమణ, జిల్లా సమితి సభ్యుడు తూం బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మైనొద్దీన్, మండల కార్యదర్శి కనకాచారి, సహాయ కార్యదర్శులు శైలేష్, విజయేందర్‌రెడ్డి, రవీంద్ర, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.